

# నేను అనాథను కాను

అప్పటికి గోవింద్ పదేళ్ళవాడు. ఆరోజు స్కూల్లో మిఠాయి పంచారు. పిల్లలందరూ సంతోషంగా వున్నారు. మరుసటిరోజు పట్టణమంతా గందరగోళంగా వుంది. ప్రజలు తమ ఇళ్ళూవాకిళ్ళూ వదిలి, సురక్షితమైన చోటు వెదుక్కుంటూ, రైల్వేస్టేషన్ వైపు వెళుతున్నారు. గోవింద్ తన క్లాస్‌మేటు, స్నేహితుడు అయిన ఇత్తెఫాక్‌తో కలిసి స్కూలు నుంచి తిరిగివస్తూ ఇదంతా బాగా గమనించాడు. ఇదంతా గోవింద్‌కు అర్థంకాని విషయం. ప్రజలు పట్టణం వదిలివెళ్ళే కార్యక్రమం కొనసాగుతోంది. గోవింద్ వుండబట్టలేకపోయాడు. అతను ఒకరోజు ధైర్యంచేసి తన తాతగారినడిగేశాడు.

'బాబాసాయీ! వీరంతా ఎక్కడికి వెళుతున్నారు?'

తాత వద్ద ఏదైనా జవాబుంటేకదా చెప్పడానికి!

గోవింద్ హైదరాబాద్ (సింధ్)లోని గంజ్ బక్ష్ వీధిలో వుంటున్నాడు. వారింటినానుకునే కసాయివాళ్ళ వీధి వుండేది. ఒకరోజు గోవింద్ తన క్లాస్‌మేట్ ఇత్తెఫాక్‌ను అడిగాడు.

'మిత్రమా, ఈవిషయం నాకేమీ అర్థంకాలేదు. నీకేమైనా తెలుసా?'

ఇత్తెఫాక్ తనకు తెలియదన్నట్లు తలాడిస్తూ అన్నాడు, 'పద, మా అమ్మీని అడుగుదాం'.

'అమ్మీ చెప్పింది- 'నాయనా! ఇకనుంచి మా అంగట్లో నీకు మేక మాంసం దొరకదు. దాంతో పాటు సింధునదిలోని రుచికరమైన చేపలు కూడ హిందుస్థాన్‌లోని నదుల్లోకి- చెరువుల్లోకి చేరిపోయాయి. అంతేకాదు నాయనా! మీ మతానుసారం మీ పుణ్యక్షేత్రాలైన కాశీ, బృందావనం, గోకులం, హరిద్వార్ అన్నీ అక్కడే వున్నాయి. అందువలన సింధీ హిందువులైన మీరంతా అక్కడికి వెళుతున్నారు. ఇదేవిధంగా హిందుస్థాన్‌లో వున్న మా దీన్‌భాయి పాకిస్థాన్ వస్తున్నారు. వారు ఇక్కడ మీ ఇళ్ళలో వుంటారు.

తన వయస్సు, అవగాహనల దృష్ట్యా గోవింద్‌కు విషయం పూర్తిగా బోధపడలేదు. చూస్తూ వుండగానే అతని ఇంట్లో సభ్యులు కూడ సామానంతా సర్దుకోసాగారు. ఇక తాము కూడా మిగిలినవారిలా ఇక్కడి నుంచి వెళ్ళిపోవాల్సి వుంటుందని అతనికి బోధపడింది.

హిందుస్థాన్ చేరుకోగానే వారిని ఇటలీ ఖైదీల కోసం నిర్మించిన బెరాక్‌లలో నింపేశారు. అమాయకుడైన గోవింద్‌కు చరిత్ర ఆడిన ఈ ఎగతాళి అర్థంకాలేదు. మాతృభూమిని వదిలివచ్చిన తర్వాత సింధీ కుటుంబాలు కూడా స్వాతంత్ర్యపోరాటంలో పాల్గొన్నారు. కానీ ఇక్కడి పట్టణవాసులు వారిని సింధీ సోదరులనీ, రెఫ్యూజీలనీ, శరణార్థులనీ సంబోధించేవారు.


సింధీమూలం:

**ఝుమ్మూఝుగానీ**

తెలుగు అనువాదం:

**కొమ్మిశెట్టి మోహన్**


ఆరోజుల్లో గోవింద్ సాల్వార్- చొక్కా ధరించేవాడు. కాళ్ళకు పొడవాటి పఠానీ జోళ్ళుండేవి. అతని చెల్లెళ్ళు కూడా సాల్వార్- కుర్తా ధరించేవారు. తలమీద ఒక ప్రత్యేక శైలిలో దుపట్టా వుండేది. గోవింద్ వాళ్ళ దాదిమాం నల్లని చుక్కల ప్రింటుతో ఎర్రని లంగా ధరించేది. స్థానికులు వీరి వేషధారణ చూసి అప్పుడప్పుడూ పాకిస్థానీయులని కూడ పిలిచేవారు.

గోవింద్ మెల్లమెల్లగా మానసికంగా పరిపక్వం చెందాడు. క్యాంప్‌లో వుంటూ అతను సాంప్రదాయబద్ధమైన సింధీ జానపద శైలిలో నృత్యగీతాలు, మాష్టర్ చంద్రగారి రచనలు వినేవాడు. అతను సింధీ నాటకాలు చూసేవాడు. తరచుగా, సింధీలు సింధ్ వదిలి హింద్‌లోని వచ్చారు. వారిగమ్యమెక్కడో, వారికి నిలకడెప్పుడో?'అన్న భావం గల గీతం వినేవాడు.

మెడికల్ కాలేజి ప్రారంభోత్సవానికి దేశప్రధాన మంత్రి పట్టణానికి వచ్చారు. గోవింద్ తన తాతగారితో కలిసి ఆ కార్యక్రమం చూడడానికి వెళ్ళాడు. వైద్యానికి సంబంధించి చదివే విద్యార్థులు ఈ ఉన్నతమైన భవనంలోనే వుంటారని తెలుసుకున్నపుడు అతని మనసు గంతులు వేసింది. అతను తన తాతగారితో అన్నాడు.

'బాబాసాయీ! నేను కూడా డాక్టరునవుతాను.'

అప్పటినుంచి అతనికి ఎప్పుడూ అదే ధ్యాస. యం.బి.బి.యస్.కు సెలెక్టు అయినరోజు అందరి కళ్ళలో ఆనందబాష్పాలు. ఇక గోవింద్ సంగతి చెప్పనవసరంలేదు. అతను చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ శ్రద్ధ చూపేవాడు. సింధ్ స్మృతులు గోవింద్‌ను వెంటాడుతూనే వున్నాయి. యం.బి.బి.యస్. పూర్తయిన

తర్వాత గోవింద్ ఉద్యోగం వేటలో పడ్డాడు. అదృష్టవశాత్తు వెంటనే అతనికి దుబాయ్‌లోని ఒక పేరున్న హాస్పటల్‌లో మెడికల్ ఆఫీసర్‌గా ఉద్యోగం దొరికింది. అతను సంతోషంగా అక్కడికి వెళ్ళాడు. దుబాయ్‌లో ఎంతోమంది సింధీలు రకరకాల వృత్తుల్లోను, ఉద్యోగాల్లోను వున్నారు. కాబట్టి గోవింద్‌కు సింధ్‌లో వున్నట్లుగానే అనిపించింది. దుబాయ్‌లో నివసిస్తున్న సింధీ మాట్లాడే వారిలో పాకిస్థాన్, హిందుస్థాన్ రెండు దేశాల సింధీలు వున్నారన్నది వేరే విషయం. అక్కడ అతనిని ప్రతిరోజు హైదరాబాద్, సింధ్, ఇతర నగరాల ప్రజలు కలిసేవారు. గోవింద్‌కు ఎప్పుడైనా తన జన్మభూమి సమీపంలోని వ్యక్తి తటస్థపడితే, అతనువెంటనే గంజ్‌బక్ష్ వీధిని గురించి, అక్కడి ప్రజల యోగక్షేమాల గురించి అడిగేవాడు. అదృష్టవశాత్తు ఒకరోజు అతనికి హైదరాబాదుకు చెందిన ఒక స్నేహితుడు కనిపించాడు. ఇత్తెఫాక్ హైదరాబాదులో సుప్రసిద్ధుడైన న్యాయవేత్త అని అతను చెప్పాడు. అంతేగాక అతను సింధీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కూడానని చెప్పాడు. అంతే! గోవింద్ పాత జ్ఞాపకాలను పునరుద్ధరిస్తూ ఇత్తెఫాక్‌తో ఉత్తర ప్రత్యుత్తరాలు ప్రారంభించాడు. ఇద్దరూ పరస్పరం ఉత్తరాలు అందగానే సంతోషంతో గంతులేశారు. అప్పుడప్పుడూ టెలిఫోన్‌లో కూడ ఇద్దరూ మాట్లాడుకునేవారు.

ఆ రోజుల్లోనే సింధీ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ హైదరాబాద్‌లో ఒక అంతర్జాతీయ గోష్ఠి ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేసింది. అందులో పాల్గొనడానికి ప్రపంచంలోని సింధీ సాహిత్యకారులందరినీ ఆహ్వానించాలనుకున్నారు. ఇత్తెఫాక్ గోవింద్‌ను కూడ గోష్ఠికి ఆహ్వానించాడు. ఆహ్వానపత్రమందగానే గోవింద్ ఆనందానికి హద్దులేదు. అనుకున్న తేదీనాటికి గోవింద్ విమానంలో కరాచీ మీదుగా హైదరాబాద్ చేరుకున్నాడు. చలికాలం. ఎయిర్‌పోర్టు రన్‌వేలోంచి చెకింగ్ పూర్తికాగానే ట్రాలీలో తన సామాను తోసుకుంటూ గోవింద్ లాంజ్‌లోకి అడుగుపెట్టాడు. కొంతమంది నవయువకులు చేతిలో ప్లేకార్డులతో నిలబడి వున్నారు. ప్లేకార్డుల్లో ఇలా రాసి వుంది. 'సింధ్‌భూమి మిమ్మల్ని స్వాగతిస్తోంది'. ఒక యువకుని కోటు మీది బాడ్జ్‌మీద, 'ఇత్తెఫాక్, జనరల్ సెక్రటరీ' అని రాసివుంది. అక్షరాలు దూరం నుంచే స్పష్టంగా చదువగలిగేట్లు కనిపిస్తున్నాయి. గోవింద్ పరిసరాల్ని మరిచిపోయి ఇత్తెఫాక్‌ను కౌగలించుకున్నాడు. స్నేహితులిద్దరి కళ్ళలోంచి అశ్రుధారలు ప్రవహించాయి. ఈకలయిక దృశ్యం చూస్తున్నవారి కళ్ళు కూడ చమర్చాయి. స్నేహితులిద్దరి కన్నీళ్ళు ఆగేట్లు లేవు. ఇద్దరూ ఏమి మాట్లాడలేకపోయారు.

ఎన్నో సంవత్సరాలకు పూర్వం గోవింద్ వదిలి వెళ్ళిన హైదరాబాద్ నగరం ఇప్పుడెంతో మారిపోయింది. నగరంలో ప్రభుత్వం మారడంతో నగరం కూడ మారింది. రోడ్డుమీద వేగంగా పరుగెడుతున్న కారులో ఆలోచనల్లో లీనమై కూచుని వున్నాడు. స్ట్రీట్ లైట్లకాంతి కారు వేగం పెంచడంలో సహాయపడుతోంది.

గోష్ఠి రెండురోజులు హోటల్ గదిలో సునాయాసంగా గడచిపోయాయి. గోడమీద గడియారాలు వేగంగా తిరుగుతూ కాలాన్ని వేగంగా

గోవింద్ పరిసరాల్ని మరిచిపోయి ఇత్తెఫాక్‌ను కౌగలించుకున్నాడు. స్నేహితులిద్దరి కళ్ళలోంచి అశ్రుధారలు ప్రవహించాయి. ఈకలయిక దృశ్యం చూస్తున్నవారి కళ్ళు కూడ చమర్చాయి. స్నేహితులిద్దరి కన్నీళ్ళు ఆగేట్లు లేవు. ఇద్దరూ ఏమి మాట్లాడలేకపోయారు.

ముందుకు నడిపించినట్లనిపించింది. గోష్ఠిలో గోవింద్‌కు కొత్త స్నేహితులు కూడ ఏర్పడ్డారు. తాను నివసించిన పాత వీధిలోకి వెళ్ళాలనే బలీయమైన కోరికను గోవింద్ ఈరెండురోజులు ఎలా అణచివుంచాడో తెలీదు. గోష్ఠి ముగియగానే గోవింద్ మనసు పక్షిలా రెక్కలాడిస్తూ గంజ్ బక్ష్ ప్రాంతం వైపు ఎగిరిపోయింది. అక్కడ గోవింద్ ముఖ్యంగా ఇత్తెఫాక్ తల్లిని చూడాలనుకున్నాడు. తన పాత ఇంటిని కూడ చూడాలనే కుతూహలం కలిగింది. చిన్నతనంలో తనకు తల్లిదండ్రులు జోలపాటలు పాడి, ముద్దుమురిపాలతో అలౌకిక ఆనందాన్ని పంచి ఇచ్చిన తన స్వంత ఇంటిని చూడాలనే ఆరాటం పెరిగింది. తుదకు ఆ ఘడియరానే వచ్చింది. ఇత్తెఫాక్ తల్లి వయస్సు ప్రస్తుతం 85 సంవత్సరాలు. కళ్ళకు దళసరి అద్దాలు ధరించింది. ఆమె ముఖంలోని ముడుతల్లో జీవితంలోని ఒడిదుడుకులన్నీ స్పష్టంగా కనిపిస్తున్నాయి. కానీ ఆమె ముఖంలో ఇప్పటికీ ఏదో కాంతి వుంది. ఇత్తెఫాక్ పరిచయం చేశాడు. 'అమ్మీ! ఇతను రాధీకుమారుడు'. రాధీ పేరు వినగానే అమ్మీ ఠక్కున అంది, 'అరె, గోవింద్ కదూ? సింధ్ వదిలేటప్పటికి నువ్వు ఎనిమిది, పదేళ్ళ వాడివి. పొట్టిప్యాంటు, చొక్కా తొడుక్కుని రోజంతా ఇత్తెఫాక్‌తో కలిసి ఆడుతూ వుండేవాడివి'. అమ్మీ గోవింద్ ఇంట్లో ప్రతి ఒకరిని గురించి వివరంగా అడిగి తెలుసుకుంది. మాట్లాడుతూంటే అమ్మీ గొంతు బొంగురుబోయింది.

'నాయనా, మేము కసాయివాళ్ళం. నిన్ను గట్టిగా కౌగలించుకోవాలని మనసు ఆరాటపడుతోంది. నిన్ను తాకితే మైలపడతావు. నువ్వు మళ్ళీ స్నానంచేసి బట్టలు మార్చుకోవాలి. కాబట్టి నిన్ను నేనెలా కౌగలించుకునేది?'

గోవింద్‌కు కూడ గొంతు బొంగురుబోయింది. అతను మరుక్షణమే ఇత్తెఫాక్ తల్లిని కౌగలించుకుని వెక్కివెక్కి ఏడ్వసాగాడు. ఏడుస్తూనే అతను చెప్పసాగాడు.

'యాభై ఏళ్ళకు ముందే మీరు మమ్మల్ని కౌగలించుకుని వుంటే బహుశ మేము సింధ్ వదిలి వెళ్ళేవాళ్ళం కాదు.'

ఇంతలో ఇత్తెఫాక్ బీరువాలోంచి ఒక శాలువా తీసి అమ్మీకి ఇచ్చాడు. అమ్మీ ఆ శాలువాను గోవిందకు కప్పింది. గోవింద్ అమ్మీ పాదాలు తాకుతూ అన్నాడు-

'ఈరోజు నాకు మళ్ళీ మా అమ్మ దొరికింది. నేనిప్పుడు అనాథనుకాను. అనాథనుకాను'

అతను వెక్కివెక్కి ఏడ్వసాగాడు. ●

